క్లుప్తంగా

వెండి కిరీటాలు బహూకరణ



రాములోరికి అలంకరించిన వెండికిరీటాలు

దండేపల్లి: మండల కేంద్రంలోని రామాలయం లో ఉన్న సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయు లకు మంగళవారం దండేపల్లికి చెందిన గోలి నగేష్ రూ.1.35 లక్షల విలువచేసే వెండి కిరీటాలు బహూకరించారు. బస్టాండు నుంచి బ్యాండు మేళాలతో భక్తులు ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకెళ్లారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తుల సమక్షంలో వాటిని దేవతా మూర్తుల విగ్రహాలకు అలంకరించారు.

ఇంటి రుణ వడ్డీ వెంటనే చెల్లించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో కార్మికులు తీసుకునే ఇంటి రుణంపై కంపెనీ చెల్లించే వడ్డీ(హెచ్పిఎల్‌ఆర్ఎస్) డబ్బులను వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంటి రుణం తీసుకున్న వారికి వడ్డీని వెంటనే చెల్లించాల్సి ఉండగా జాప్యం జరుగుతుందన్నారు. శ్రీరాంపూర్ డివిజన్‌లో అధికారులు నత్తనడకన ఫైలు క్లియర్ చేస్తున్నారని, వడ్డీ కోసం చేసుకున్న దరఖాస్తులు నెలలు గడుస్తున్నా వాటిని పరిష్కరించడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సర్ఫేస్ జనరల్ మజ్దూర్ భర్తీలో పైరవీలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో 108 సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఖాళీల భర్తీలో పైరవీలు చోటు చేసుకుంటున్నాయని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేష్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖాళీల భర్తీకి మెరిట్ లిస్టును రూపొందించి ప్రకటించినా కౌన్సెలింగ్ నిర్వహించి లెటర్లు ఇవ్వడం లేదన్నారు. ఎలాంటి కారణం లేకుండా కౌన్సెలింగ్ ప్రక్రియను నిలిపివేశారని, దీని వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయన్నారు. పూర్తి పారదర్శకంగా వీటిని భర్తీ చేయాలని, అర్హులైన వారినే తీసుకోవాలని, వేజ్ ప్రొటెక్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

గణేశ్ మండపాల వద్ద రక్తదానం చేయాలి

మంచిర్యాలటౌన్: గణేశ్ మండపాల వద్ద యువకులు అన్నదానాలతో పాటే స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో రక్త నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయని, దీంతో తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు, ప్రభుత్వ ఆసుపత్రిలోని గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

విద్యార్థులకు న్యాస్ నమూనా పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: దేశవ్యాప్తంగా నవంబర్ 19న నిర్వహించే జాతీయసాధన సర్వేకు(న్యాస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలో చదువుతున్న విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు మంగళవారం ప్రభుత్వ, లోకల్ బాడీ, కేజీబీవీ, మోడల్‌స్కూల్, యుఆర్ఎస్‌లో 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు న్యాస్ నమూనా పరీక్షలు జరిపారు. అబ్జెక్టివ్ టైప్ అడిగే ప్రశ్నలకు సరైన సమాధానాన్ని నమూనా ఓఎంఆర్ సీట్లో బబ్లింగ్ చేసే ప్రక్రియలో విద్యార్థులకు ప్రాక్టీస్ చేయించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

రెండోరోజు కొనసాగిన సర్వే

భీమారం: మండల కేంద్రంలోని ఊరచెరువు భూములకు హద్దులు నిర్ణయించేందుకు జరుగుతున్న సర్వే మంగళవారం కూడా కొనసాగింది. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో సర్వే చేస్తున్నారు. అంకుసాపూర్ శివారులోని హద్దురాళ్లనుంచి సర్వే చేసుకుంటూ భీమారంలోని సర్వేనంబర్ 570ని గుర్తించి అందులో సర్వే చేపట్టారు. బృందాలుగా ఏర్పడి చెరువు చుట్టూ డిజిటల్ మిషన్లతో సర్వే చేస్తున్నారు. బుధవారం నాటికి సర్వే పూర్తి చేస్తామని తహసీల్దార్ సదానందం తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శారద, ఎస్సై రాములు, ఆర్ఐ స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

డీజే యజమానుల బైండోవర్

రామకృష్ణాపూర్: పట్టణానికి చెందిన డీజే యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించి మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండపాల వద్ద, నిమజ్జనం రోజున డీజేలు పెట్టకూడదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధీరవనిత చాకలి ఐలమ్మ

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా వర్ధంతి
- నివాళులర్పించిన నాయకులు

పాతమంచిర్యాల: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని రజక సంఘం నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని రజక సంఘం కార్యాలయంలో, తోళ్లవాగు లయన్స్ క్లబ్‌లో మంగళవారం ఐలమ్మ 39 వవర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐలమ్మ మహిళా శక్తికి ప్రతీక అని, భూమి కోసం సాయుధ పోరాటాలు చేసి దొరలు, భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల అహంకార పాలనకు వ్యతిరేఖంగా ఉద్యమించిన ధీరురాలు అని ఆమె పోరాటస్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు సంగెం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, తాడూరి శంకర్, కుమార్, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు పారిపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పోషం, నిమ్మరాజుల కుమార్, ధర్మయ్య, నేరెళ్ల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: స్థానిక పాతబస్టాండులోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజకసంఘం నాయకులు రాజన్న, సురేష్, లింగన్న, లక్ష్మణ్, బాపన్న, రవి, మల్లేశ్, తిరుపతి, భీమన్న పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్(తాండూర్): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని తాండూర్ మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు పెండ్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సాంబయ్య, మండల అధ్యక్షుడు భరత్, ఉపాధ్యక్షుడు మల్లేశ్, నాయకులు నరేష్, విగ్నేష్, వెంకటేష్, ఇతర సంఘాల నాయకులు చిరంజీవి, రాజేశం, రాజారాం, అరవింద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న నాయకులు



బెల్లంపల్లిరూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



నెన్నెల: నివాళులర్పిస్తున్న నాయకులు

దండేపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కట్కూరి రాజన్న అన్నారు. రజక సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంగడి బజార్ సమీపంలోని ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్, ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, రజకసంఘం మండల అధ్యక్షుడు తిరుపతి, పట్టణ అధ్యక్షుడు సత్యం, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చెన్నూర్: రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొండపర్తి వెంకటరాజం, నాయకులు నిమ్మల పోచమల్లు, పాయిరాల బాపు, అయిలాల రమేశ్, పెద్దకొండ నరేశ్, పొన్న మధు, నిమ్మల రాములు, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని మార్కెట్ సమీపంలో ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వీర వనిత చాకలి ఐలమ్మ ఉద్యమస్ఫూర్తిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

నెన్నెలలో...

నెన్నెల: మండల కేంద్రంలోని చాకలివాడలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తికోసం సాయుధ పోరాటం చేసిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండపర్తి వెంకటేష్, కందె నరేష్, అన్నారపు సత్తయ్య, చంద్రగిరి రాకేష్, కొండపర్తి ఆశయ్య, నవీన్, మహేష్, లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట కనికరపు రాజన్న కాలనీ, కిష్టంపేట గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నగేష్, సంధ్య, సమ్మక్క, యామిని, రమాదేవి, సత్తన్న, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.



లక్సెట్టిపేట: చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



దండేపల్లి: విగ్రహం వద్ద నాయకుల నివాళి



చెన్నూర్‌రూరల్: సీపీఎం నాయకుల నివాళి



చెన్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



పాతమంచిర్యాల: రజకసంఘం కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు



మందమర్రిరూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్



లోలెవల్ వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: అర్హులైన ప్రతీ రైతుకు ప్రభుత్వం రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్, తపాలాపూర్, సింగరాయిపేట, రోటిగూడ, చింతగూడ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కడెం ప్రాజెక్టు గురించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు కేటాయించిందన్నారు. భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను బాగుచేయిస్తామన్నారు. త్వరలో అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు అందజేస్తామన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ఎరుకల కులస్తులకు జీవనోపాధి కల్పించాలి



మాట్లాడుతున్న దుగ్యాల బాపు

బెల్లంపల్లి: పందులను జీవనాధారం చేసుకుని జీవిస్తున్న ఆదివాసీ ఎరుకల కులస్తుల జీవనోపాధిని పెంపొందించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాపు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పందుల పెంపకానికి వడ్డీలేని రుణాలను మంజూరు చేయాలని, రాయితీ సౌకర్యం కల్పించాలని, కమ్యూనిటీహాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. సంఘం బెల్లంపల్లి మండల అధ్యక్షుడు శ్రీరాముల రమేశ్, కన్నెపల్లి, నెన్నెల మండలాల అధ్యక్షులు శ్రీరాముల ముక్తేష్, శ్రీరాముల మల్లేశ్, కోశాధికారి సుల్తాన్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్, ఈఎస్ఐ సవరణ చేయాలి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న 275 మంది కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన పీఎఫ్, ఈఎస్ఐ సవరణలు, పేరు మార్పుల గురించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ మంగళవారం కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమందికి పీఎఫ్ కట్ కావడంలేదని, దీంతో ఏడాదికి రూ.లక్ష వరకు నష్టపోతున్నామన్నారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 30 మంది కార్మికుల పేర్లు పర్మినెంట్‌గా ఎక్కించాలని, లేనిపక్షంలో ఈ నెల 19 నుంచి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడతామన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎయిడ్స్‌పై అవగాహన

మంచిర్యాలటౌన్: సమగ్ర ఆరోగ్య ప్రచారం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దిశ సీపీఎం నీలిమ, సీఎస్‌వో రాజేశ్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ అశోక్, డాక్టర్ స్నేహిత పాల్గొన్నారు.

బైక్ రైడర్ల బైండోవర్

చెన్నూర్: ప్రమాదకరంగా బైక్ నడుపుతున్న మండలంలోని కొమ్మెర, కిష్టంపేట గ్రామాలకు చెందిన అజయ్, మేకల రాజును అదుపులోకి తీసుకుని మంగళవారం తహసీల్దార్ మల్లికార్జున్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. సీఐ మాట్లాడుతూ ఇన్‌స్టాగామ్‌లో లైక్ వస్తాయని ఇద్దరు యువకులు బైక్‌లపై స్టంట్‌లు చేస్తున్నారని తెలిపారు. రూ.2 లక్షల పూచికత్తుపై బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ముగ్గుల పోటీలు

రామకృష్ణాపూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక శివాజీ గణేశ్ మండలి వద్ద మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.

డంప్‌యార్డు స్థల పరిశీలన

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో డంప్‌యార్డు ఏర్పాటు కోసం మంగళవారం ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావు మున్సిపాలిటీలోని 9వ వార్డు పరిధిలో జన నివాసాలకు దూరంగా ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు భూక్య రాములు నాయక్, ఆస్మాషేక్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని దీక్ష

జన్నారం: రైతులకు పూర్తిస్థాయిలో పంట రుణమాఫీ చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. మండల అధ్యక్షుడు మధుసూధన్‌రావు, ప్రధాన కార్యదర్శులు రమేశ్‌గౌడ్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మంచిర్యాలక్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఇబ్బందుల్లో ఉన్న ఓ నిరుపేద మహిళకు ఎస్సై రాములు ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నాడు. పాత మంచిర్యాలకు చెందిన ముప్పిడి స్వరూప ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడింది. చికిత్స చేయించుకునేందుకు డబ్బులు లేక పోవడంతో ఎస్సై రాములు స్పందించి బాధిత మహిళకు మంగళవారం రూ.5 వేలు అందజేశారు.

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

బెల్లంపల్లిరూరల్: మండలంలోని తాళ్ల గురిజాల పీహెచ్‌సీలో మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం నిర్వహించారు. వైద్యాధికారి తమ్మడి ఎవంజలీన్ మాట్లాడుతూ క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడిన వారి కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. చిన్నచిన్న సమస్యలకు ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు.

విద్యార్థులకు అవగాహన

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ఒత్తిడి నియంత్రణ గురించి సానుకూల దృక్పథం వల్ల కలిగే లాభాలపై వివరించారు. ప్రిన్సిపాల్ పాండురంగశర్మ, వైస్ ప్రిన్సిపాల్ సునీత, వనితా వాక్కు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

భీమారం: అంకుసాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణ తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

సన్మానం

దండేపల్లి: ఇటీవల గద్దర్ పురస్కారం అందుకున్న మండలంలోని నెల్కివెంకటాపూర్‌కు చెందిన కళాకారుడు ముల్కల్ల మురళిని మంగళవారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి

మందమర్రిరూరల్: పట్టణంలోని యాపల్ ప్రాంతంలో నేషనల్ హైవే రోడ్డు పక్కన బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అబ్బాస్, మజార్, పోశం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి

జైపూర్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సిద్దం చంద్రయ్య (87) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. జైపూర్ ఉపసర్పంచ్‌గా రెండు దఫాలుగా పనిచేశాడు.

12న గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

మంచిర్యాలఅర్బన్: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి, 6, 7, 8, 9 తరగతుల్లో ఎస్సీ కేటగిరీలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 12న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు గురుకుల విద్యాలయాల జోనల్ ఆఫీసర్ హెచ్.అరుణాకుమారి తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఉన్న 9 బాలికలు, 8 బాలుర పాఠశాలల్లో మిగిలిపోయిన ఖాళీలను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాల తొలగింపు

నస్పూర్: పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ కట్టడాలను మంగళవారం మున్సిపల్, రెవెన్యూ అధికారులు జేసీబీ సహాయంతో తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. నస్పూర్ శివారు సర్వే నంబర్ 42 టీఎన్‌జీఓలకు కేటాయించిన భూమిలోని సుమారు 25 గుంటల స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టారని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. సదరు వ్యక్తులు అట్టి స్థలంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టడానికి మున్సిపల్ అధికారులకు దరఖాస్తు చేసుకోగా తాము సిబ్బందితో కలిసి వెళ్లి స్థలాన్ని పరిశీలించి సుమారు 25 గుంటల మేర భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. బాధితుడు పానుగంటి గోపాల్‌రావు మాట్లాడుతూ తన భార్యకు చెందిన భూమిలో శాశ్వత నిర్మాణం చేపట్టడానికి మున్సిపల్ అధికారులకు దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వ ఫీజు రూ.52 లక్షలు అవుతుందని చెప్పారని, తాను సీడీఎంఏ అధికారులకు దరఖాస్తు చేసుకోగా రూ.19 లక్షలు చెల్లించమన్నారని ఆయన పేర్కొన్నారు. ఇదే విషయాన్ని మున్సిపల్ కమిషనర్‌కి తెలుపగా మీరు నిర్మాణాన్ని చేపట్టాలంటే రూ.10 లక్షలు తనకు ఇవ్వాలని డిమాండ్ చేశాడని, తాను డబ్బులు ఇవ్వని కారణంగానే తన కట్టడాలను కూల్చివేయిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ సతీష్ మాట్లాడుతూ తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నెల్కి సుగుణాకర్, ఆర్ఐ మాంతయ్య, మున్సిపల్, రెవెన్యు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న బాధితులు

ఆది నుండి వివాదమే..

నస్పూర్ శివారు సర్వే నంబర్ 42 ప్రభుత్వ భూమి ఆది నుండి వివాదాల మయమే.42 సర్వే నంబర్ భూమి కలెక్టరేట్‌కు సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో పలువురు ఆక్రమణ దారులు కళ్లు దానిపై పడ్డాయి. నకిలీ పత్రాలను సృష్టించి పలువురు కొంత భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. ఇదే సర్వేనంబర్‌లో ప్రభుత్వం టీఎన్‌జీఓ సొసైటీకి కొంత భూమిని కేటాయించిన విషయం తెలిసిందే. దీనిపై కొన్నేళ్లుగా కోర్టులో కేసులు నడుస్తున్నాయి. కొన్ని నెలల క్రితం టీఎస్‌జీఓలకు కేటాయించిన భూమిలోని ఎలాంటి అనుమతులు లేకుండా కట్టడాలు చేపట్టారని పలు నిర్మాణాలను అధికారులు కూల్చివేయించారు.

పట్టణ కమిటీ ఎన్నిక

మందమర్రిరూరల్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మందమర్రి పట్టణ కమిటీని జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్ సమక్షంలో మంగళవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బత్తుల సతీష్‌బాబు, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, సాగర్‌బాబు, రాజు, పారిపల్లి శివరామకృష్ణ, కోశాధికారిగా కడాలి శ్రీనివాస్, గౌరవాధ్యక్షులుగా పోలు శ్రీనివాస్, బొలిషెట్టి రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా బేర వేణుగోపాల్, కుర్రె శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా నోముల ఉపేందర్‌గౌడ్, శేఖర్, జాయింట్ సెక్రెటరీలుగా ఎం.సత్యనారాయణ, గాండ్ల సంజీవ్ పటేల్, తాటం శ్రీనివాస్, వేముల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జమలాపూర్ నర్సోజీ, పోలు సంపత్, మదసాని శంకర్‌గౌడ్, పోలు కుమార్, మీడియా ఇన్‌చార్జిగా రామోజుల సంతోష్‌చారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా మహారాజుల సంపత్, కట్కోజ్వల వేణు, దానపల్లి తిరుపతి, రాజు, సత్యం, కాగితపు శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చెరువు తూముకు మరమ్మతులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి రైల్వే రడగంబాల బస్తీలో ఉన్న జాతికుంట చెరువు తూముకు మంగళవారం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. చెరువు నిండుగా నిండి ప్రమాదకరంగా మారడంతో దిగువ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇళ్లకు ముప్పు ఏర్పడింది. తూము నుంచి నీరు బయటకు వెళ్లే అవకాశాలు లేక పోవడంతో రిపేరు చేయించి జనవాసాలను ముంచెత్తకుండా నివారణ చర్యలు తీసుకున్నారు. అనంతరం నీటిని బయటకు వదలడంతో దిగువ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

బెల్లంపల్లి: బెల్లంపల్లి పోచమ్మ చెరువులో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్, కమిషనర్ శ్రీనివాస్‌రావు పరిశీలించారు.

దండేపల్లి: మండలంలోని గూడెం, ద్వారక గోదావరి నదితీరాలను లక్సెట్టిపేట సీఐ నరేందర్, దండేపల్లి తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, ఎస్సై ఉదయ్‌కిరణ్ పరిశీలించారు.

బెల్లంపల్లిరూరల్(తాండూర్): తాండూర్ మండల పరిధిలోని పెద్ద చెరువును తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కుమారస్వామి, ఎస్సై కిరణ్ కుమార్ పరిశీలించారు.

రక్తహీనతకు గురికాకుండా చూడాలి

దండేపల్లి: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనతకు గురికాకుండా చూడాలని లక్సెట్టిపేట సీడీపీవో రేష్మా సూచించారు. మండలంలోని మోకాసిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు.

చెన్నూర్: గర్భిణులు, బాలింతల్లో పోషకాహారం లోపిస్తే ఆరోగ్య సమస్యలు వస్తాయని సీడీపీవో మనోరమ అన్నారు. స్థానిక కుమ్మరి బొగుడ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు చేశారు. సూపర్‌వైజర్లు రమాదేవి, లావణ్య, మహిత, సరోజ, పద్మలు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మారుతి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం ప్రదర్శించి, బాలింతలకు అంగన్‌వాడీ టీచర్ తిరుమల అవగాహన కల్పించారు.

ఖాళీ సిరప్ బాటిల్ ఇచ్చారు..



ఖాళీ సిరప్ బుడ్డీ చూపిస్తున్న మనోజ్

చెన్నూర్: చెన్నూర్ సీహెచ్‌సీలో మందులకు బదులుగా ఖాళీ సీసా బుడ్డీలు ఇస్తున్నారని పట్టణానికి చెందిన మనోజ్ ఆరోపించారు. తమ కుమారుడు సాయి నిర్విగ్‌కు ఆరోగ్యం బాగాలేక పోవడంతో మంగళవారం ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు సత్యనారాయణ పరీక్షలు నిర్వహించి ఫార్మాసిస్టు వద్ద మందులు తీసుకొమ్మని చీటీ రాసిచ్చినట్లు తెలిపాడు. ఫార్మాసిస్టు సిఫికిమ్స్ సిరప్ బాటిల్ ఇవ్వగా అది సీల్‌చేసి ఉన్నప్పటికీ అందులో మందులేదన్నాడు. ఇదేమని అడిగితే సమాధానం చెప్పేవారే లేరన్నాడు. ఈ విషయమై కలెక్టర్ స్పందించాలని ఆయన కోరారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణను వివరణ కోరగా పొరపాటు ఎక్కడ జరిగిందో తెలుసుకుంటామన్నారు.